క్లుప్తంగా

కర్లపాలెంలో వాహన తనిఖీలు



కర్లపాలెం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు తెలిపారు. ఆదివారం కర్లపాలెంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా సంచరించరాదని చెప్పారు. అల్లర్లకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత



కర్లపాలెం: భవన నిర్మాణ కార్మికులకు తాపీ వర్కర్స్ యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా తెలిపారు. కర్లపాలెం పంచాయతీ కొత్త ఇస్లాం పేటకు చెందిన తాపీ వర్కర్ షేక్ హసన్ ఇటీవల మృతి చెందటంతో అతని కుటుంబ సభ్యులకు ఆదివారం తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.4 వేల నగదు అందజేశారు. కరిముల్లా మాట్లాడుతూ కార్మికులంతా యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవటం ద్వారా ప్రభుత్వ పథకాలతో పాటు ఆర్థిక ప్రయోజనం పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ కాశిం, షేక్ ముస్తఫా, పఠాన్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాలలో భాగంగా రెండో రోజు ఆదివారం వేడి నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ మహోత్సవాలు తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమాలను గ్రామ కమిటీ, యువజన సంఘం పర్యవేక్షించింది.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు



ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై కొలువైన కార్మెల్ మాతను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఆళ్లగడ్డ, ధర్మవరం, మాచర్ల ప్రాంతాలనుండి రైళ్లు, బస్సుల ద్వారా పెద్దసంఖ్యలో వచ్చారు. కార్మెల్ మాతకు తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



మృతి చెందిన ఉదయ్‌భాస్కర్

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సంకురాత్రిపాటి ఉదయ్‌భాస్కర్(56) నగరంలో హోంగార్డుగా పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే శనివారం తన ఆటోలో విధులకు హాజరయ్యాడు. అనంతరం విధులు ముగించుకుని ఇంటికి తన ఆటోలో వెళుతుండగా నల్లపాడు కేంద్రీయ విద్యాలయం వద్ద కుక్కను తప్పించబోయి ఆటో డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఉదయ్‌భాస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు సహకరించండి

- రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ
- పోలింగ్ ఏజెంట్లకు ఓట్ల లెక్కింపుపై అవగాహన



ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ నజీర్‌బేగ్

రేపల్లె రూరల్: ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని రేపల్లె డీఎస్పీ టీ.మురళీకృష్ణ సూచించారు. పోలింగ్ ఏజెంట్లకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఘర్షణలు, కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. కేంద్రాలకు చేరుకునే ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నుంచి జారీ చేయబడిన పాస్‌తో పాటు ఫారమ్-18, ఏదైనా గుర్తింపు కార్డులను తమ వెంట తీసుకురావాలన్నారు. ఉదయం 6 గంటలకే బాపట్లలోని కౌటింగ్ కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్‌లు నిషేధమన్నారు. లెక్కింపు కేంద్రానికి చేరుకునే అభ్యర్థి, ఏజెంట్లను 200 మీటర్లు, 100 మీటర్ల దూరంలో రెండు విడతలుగా తనిఖీలు నిర్వహించి పంపటం జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాలులోకి వెళ్లిన వారు కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు బయటకు వెళ్లరాదన్నారు. కౌంటింగ్ ముగిసిన తరువాత 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చటం వంటివి చేయరాదన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏజెంట్లు పాటించాల్సిన నియమ నిబంధనలను పట్టణ సీఐ నజీర్‌బేగ్ వివరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి ఉత్సవాలు



పాండురంగస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే రఘుపతి

బాపట్ల: హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి స్థానిక చీలురోడ్డులోని శ్రీ పాండురంగ స్వామి దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మన్యసూక్త సహిత హనుమన్మహామంత్ర హోమం ,పూర్ణాహుతి, అన్నకూట మహా నీరాజనం అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం సామూహిక అన్న సంతర్పణ విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. శ్రీ లలితా త్రిపుర సుందరీపీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొల్లిపర వెంకట శివ వర ప్రసాద్, పంగులూరి కౌండిన్య, గూడూరు సాయి వెంకట్, వక్కలగడ్డ బాలాజీ, ఆలయ ధర్మకర్త బదరీ నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని రథోత్సవం

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో ఆదివారం అంజనేయస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏకాదశ దీక్షతో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో చివరి రోజు రథోత్సవం నిర్వహించారు. పెరుమాళ్ల వెంకట సుబ్బయ్య, పెనుమాళ్ల రామయ్య, డాక్టర్ అబ్దుల్ కలాం అజాద్ దంపతులు రథోత్సవం కర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు. కొలిపాకుల మస్తాన్ రావు, కలవ వెంకట రాధా మధుసూదనరావు పర్యవేక్షణలో జరిగిన ఉత్సవాలలో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు, శ్రీ అంజనేయ భక్త సమాజం, అంజనేయ యువజన భక్త సమాజాల వారు కోలాట భజనలు చేసి స్వామి భజన కీర్తనలు ఆలపించారు. మేళ తాళాలు, బాణాసంచా నడుమ భక్తులు హనుమ నామ సంకీర్తన జరిపారు. గ్రామస్తులు వీధి వీధినా అంజనేయ స్వామికి హారతులు పట్టారు.

అంబేడ్కర్ విగ్రహ వార్షికోత్సవం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న స్థానికులు

కుచ్చెళ్లపాడు(వేమూరు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి 17 ఏళ్లు పూర్తయ్యిందని స్థానిక దళిత నాయకుడు డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అన్నారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం 17వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి జై భీమ్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భారత రాజ్యాంగంలో పొందు పరిచిన ఫలాల వల్ల ప్రతి కుటుంబం అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నటరాజ్

కర్లపాలెం: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని శ్రద్ధతో చదివి ప్రయోజకులవ్వాలని రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ మధ్యాంధ్ర కన్వీనర్ ఎ.నటరాజ్ తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో జరిగిన యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కరాటే వేసవి శిక్షణా తరగతులు ఆదివారం ముగియటంతో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని చెప్పారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఏడుకొండలు, కరాటే మాస్టర్ శ్రావణకుమార్, యోగా శిక్షకుడు బి.బాలాజీ, సమితి అధ్యక్షుడు టివి సుబ్బారావు, సభ్యులు వెంకటేశ్వర్లు, బాపిరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


యోగాతో ఆనందకర జీవితం



సభలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

లక్ష్మీపురం: ఆధునిక జీవన శైలిలో ఒత్తిడిని తట్టుకుని ఆహ్లాదకరమైన జీవితాన్ని గడిపేందుకు నిత్య జీవితంలో యోగా, ధ్యానాల్ని సాధనాలుగా మార్చుకోవాలని యోగా చార్యులు, స్వామి వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు ఆళ్ల రాజేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో రాజేశ్వరరావు మాట్లాడారు. యోగా, ధ్యానాలు ఆరోగ్యానికి సంబంధించినవి మాత్రమే కాదని, అవి శక్తివంతమైన జీవన మార్గాలని సూచించారు. మనసును లగ్నం చేసి క్రమం తప్పకుండా సాధన చేస్తే మనిషిని శారీరకంగా, మానసికంగా ఉన్నతస్థితికి చేరుస్తాయని తెలిపారు. శారీరక, మానసిక భావోద్వేగాల్లో సమతుల్యత, స్థిరత్వం, దృఢత్వాన్ని సాధించాలంటే యోగా, ధ్యానాల్ని ప్రతి ఒక్కరూ జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ సభ్యులు యోగాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇండోర్ ఆటల పోటీలు



విద్యార్థులకు నీతి కథలు



క్యారమ్స్ పోటీ

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఇండోర్ ఆటల పోటీలను జరిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చెస్, క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. ఆయా కథల్లోని నీతిని గురించి విద్యార్థులతో చెప్పించారు. ఈ క్రమంలోఈ నెల 3న శతక పద్యాల పోటీని నిర్వహిస్తామన్నారు. 7న వేసవి విజ్ఞానశిబిరం ముగింపు సభలో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని గ్రేడ్-1 లైబ్రేరియన్ కావూరి రమాదేవి వెల్లడించారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో లైబ్రరీని సందర్శిస్తూ పుస్తక పఠనాన్ని మరింత బాగా అలవరచుకోవాలని సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రోత్సహించాలని కోరారు.

జగనన్న పాలన కోసం ఎదురుచూపులు

పెరవలి పాలెం(వేమూరు): జగనన్న సంక్షేమ పాలనకు ఐదేళ్లు పూర్తయ్యిందని, మళ్లీ జగనన్న పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు లంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు జగనన్నకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. మళ్లీ అంధ్రప్రదేశ్‌కు జగనన్న ముఖ్యమంత్రి అవుతున్నాడని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రులు ఎంతో మంది ఉన్నారన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించిన ఏకైక నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా రావడం ఖాయమన్నారు.

గ్రామాల్లో జోరుగా బెట్టింగులు

ఎన్నికల ఫలితాల్లో ప్రధాన పార్టీలపై పందేలు కాస్తున్న యువత

భట్టిప్రోలు: పోలింగ్ ముగిసిన నాటి నుంచి వేమూరు నియోజకవర్గంలో గెలుపుపై ఇరు పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాన పక్షాలైన వైఎస్సార్ సీపీ, టీడీపీలు ఫలితం మాకే అనుకూలంగా ఉంటుందని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ఆవేశాలకు లోను కాకుండా తమ తమ పార్టీలకు ఓట్లు వేయించుకున్నారు. కాకమ్మ లెక్కలతో కాలక్షేపం చేస్తున్న రాజకీయ పార్టీలకు తోడుగా కొందరు ఉత్సాహవంతులు జరిగిన ఓటింగ్ సరళిని బట్టి అభ్యర్థి అసలు ఫలితం ఎటున్నా వేమూరు నియోజకవర్గం వరకు ఎవరికి మెజార్టీ రాగలదన్న అంశంపై పందేలు కాస్తున్నారు. ఈ పందేలు కాసేవారిలో కొందరు ప్రముఖులు ఉండటం విశేషం. వైఎస్సార్ సీపీ గెలిస్తే రూ.లక్షకు రూ. లక్షన్నర ఇస్తామని టీడీపీ వర్గీయులు బాహాటంగా పందేలు కాస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో మహిళలు, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరు ఏ పార్టీ వైపు మొగ్గు చూపగలరనే అంచనాలపైన రాజకీయ నాయకులు కూలంకుష విశ్లేషణలు కావిస్తున్నారు. యువత, మహిళ తమ పార్టీ వైపే మొగ్గు చూపగలరనే ఆశాభావంపై ఇటు వైఎస్సార్ సీపీ అటు టీడీపీ అంచనాలు తయారు చేసుకుంటున్నాయి. ఎగ్జిట్‌పోల్ ఫలితాలు రకరకాలుగా ఉండటంతో ఓటర్లు అయోమయ స్థితిలో ఉన్నారు. ఏది ఏమైనా ఎన్నికల ఫలితాలు రావాలంటే ఒక రోజు వేచి ఉండాల్సిందే.

నేత్రానందంగా అంకమ్మతల్లి సంబరాలు



భట్టిప్రోలు: ప్రతి మూడేళ్ల కోసారి నిర్వహించే కారుమూరు వంశీకుల కుల దేవత శ్రీ అంకమ్మ తల్లి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సంబరాలను వీక్షించేందుకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. శనివారం అమ్మవారిని పవిత్ర కృష్ణానదీ జలాలతో స్నానమాచరింపజేశారు. పూడేరు గ్రామం భక్తజన కోలాహలంతో నిండిపోయింది.

విద్యుదాఘాతంతో కాంట్రాక్టు ఉద్యోగికి తీవ్ర గాయాలు

గుంటూరు ఈస్ట్: విద్యుదాఘాతంతో కాంట్రాక్టు ఉద్యోగికి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి విశ్రాంతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. శివనాగరాజు కాలనీకి చెందిన గొల్లపల్లి సతీష్ తొమ్మిదేళ్లుగా విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ బలరాం వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. గత నెల 28న కాంట్రాక్టర్ బలరాం, లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి ఆదశాలతో నల్లచెరువులో మరమ్మతుల నిమిత్తం పోలు ఎక్కాడు. ఎల్టీ లైన్ మరమ్మతులు చేస్తుండగా హైటెన్షన్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. సతీష్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. బిల్లు ఎక్కువ కాడంతో మరో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. అయితే, ప్రమాదం జరిగిన నాటి నుంచి కాంట్రాక్టర్ బలరాం సెల్ స్విచ్ ఆఫ్ చేసి సతీష్ కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయాడు. అధికారులు ఘటనపై విచారణ జరిపి లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తిని సస్పెండ్ చేశారు. దీంతో సతీష్ వైద్య ఖర్చులు భరించే వారు లేకపోయారు. అతడికి ఇద్దరు పిల్లలున్నారు. కుమారుడి వైద్యానికి అధికారులు పూర్తిగా సహాయం చేయాలని ఆమె కోరుతోంది.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- 144 సెక్షన్ అమలులో భాగంగా నేటి సాయంత్రం 5 గంటల నుంచి 5వ తేదీ వరకు వ్యాపార సంస్థలు మూసివేత
- అత్యవసర సేవలు యధావిధిగా కొనసాగింపు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్



రేపల్లె రూరల్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నెల 3వ తేదీ సాయంత్రం నుంచి 5వ తేదీ సాయంత్రం వరకు మూడు రోజుల పాటు రేపల్లె నియోజకవర్గంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో వ్యాపార సంస్థలు పూర్తిగా మూసి వేయాలన్నారు. అత్యవసర సేవలైన వైద్యం, మెడికల్ దుకాణాలు, పాల దుకాణాలు మాత్రమే తెరిచేందుకు అనుమతులు ఉన్నాయన్నారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నియోజకవర్గంతో పాటు రేపల్లె పట్టణంలో అన్ని ప్రధాన వ్యాపార సముదాయాలు పూర్తిగా మూసి వేసి తమకు సహకరించాలన్నారు. ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండరాదన్నారు. ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడిన తరువాత విజయోత్సవ ర్యాలీలు, బాణా సంచా కాల్చటం చేయరాదన్నారు. సోషల్ మీడియా వేదికగా ఇతరులను రెచ్చగొట్టే, దూషించే పోస్టలను పెట్టటం, షేర్ చేయటం చట్టరిత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరిపై తమ నిఘా ఏర్పాటు చేయటంతో పాటు సోషల్ మీడియా అకౌంట్‌లను పరిశీలించటం జరుగుతుందని చెప్పారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటంతో పాటు రౌడీషీట్‌లు ప్రారంభించటం జరుగుతుందని హెచ్చరించారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ముగిసిన మొగదారమ్మ అమ్మవారి తిరునాళ్ల

- 20 వేల మందికి అన్నసంతర్పణ
- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ మోపిదేవి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: నిజాంపట్నంలో వేంచేసి యున్న శ్రీ మొగదారమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, పువ్వులతో కూడిన సారెను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ప్రారంభించారు. అన్న సంతర్పణ కార్యక్రమంలో 20 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, హరనాథ్‌బాబు, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


దుగ్గిరాల చిరస్మరణీయులు



దుగ్గిరాల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బాపట్ల: 'చీరాల -పేరాల ఉద్యమం' ద్వారా ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి.సి.సాయి బాబు పేర్కొన్నారు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య 135వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి పి.సి.సాయిబాబు మాట్లాడుతూ 11 నెలల పాటు చీరాల పేరాల ప్రజలను ఏకతాటిపై నడిపించారని గుర్తు చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పని చేసిన తొలి ఆంధ్రుడు దుగ్గిరాల జాతీయ స్థాయిలో ఆంధ్రుల సత్తా చాటారని అన్నారు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య బాపట్ల బోర్డు స్కూల్లో విద్యాభ్యాసం చేయడం, బాపట్ల తాలూకా ఆఫీసులో ఉద్యోగం చేయడం మనందరికీ గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో అర్ఐ ఎం.యల్లమంద, న్యాయవాది జమృద్ బాషా, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు బౌద్ధ స్తూపం వద్ద మేఘావృతమైన ఆకాశం



వాతావరణంలో మార్పుతో ఊరట

భట్టిప్రోలు: గత వారం రోజులుగా కాస్తున్న ఎండల వేడిమికి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకానికి గత రెండు రోజులుగా వాతావరణంలో నెలకొన్న మార్పు ఊరటనిచ్చింది. శని, ఆదివారాల నుంచి ఉదయం గ్రామాలలో మోస్తరు వర్షం పడగా ఆకాశం మేఘావృతమై చల్లదనాన్ని గుమ్మరిస్తూ ఈదురు గాలులు వీచాయి. గాలులతో పలు చోట్ల చినుకులు కూడా పడటంతో ప్రజానీకం సేద తీరారు. తీవ్ర ఎండలు, వడగాల్పులతో ఉక్కిరి బిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

పవర్ లిఫ్టర్ కుమారికి అభినందనలు



కుమారిని సత్కరిస్తున్న అజయ్‌కుమార్, నాయకులు

లక్ష్మీపురం: ఇటీవల మంగళగిరి పట్టణంలో జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ (మెన్ అండ్ ఉమెన్) సబ్ జూనియర్, సీనియర్ పోటీల్లో నగరానికి చెందిన న్యాయవాది, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకురాలు పర్చూరు కుమారి రెండు రజిత పతకాలు సాధించడం అభినందనీయం ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. న్యాయవాది పర్చూరు కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగం 76 కేజీల విభాగంలో 282.5 కేజీల బరువు ఎత్తి రజిత పతకం, అదే విభాగంలో బెంచ్ ప్రెస్ పోటీల్లో తలపడి మరొక రజిత పతకాన్ని సాధించినట్లు చెప్పారు. ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఏజెంట్లు సిద్ధంగా ఉండాలి

ఇండియా కూటమి తరఫున ఈ నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో ఏజెంట్లు అన్ని పత్రాలతో సిద్ధంగా ఉండాలని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.